ఓంశ్రీసాయిరాం

సత్యంమాతా పితాజ్ఞానం ధర్మోభ్రాతాదయాసఖీ ।
శాంతిఃపత్నీ క్షమాపుత్రః షడేతేమమబాంధవాః ॥

ఈప్రాకృత జగత్తునందు, ఈ విశాలమైన విశ్వమందు, భౌతికమైన ఈ లోకమందు శరీరమునకు శరీరమే మాతగా భావిస్తున్నారు. శరీరములు అశాశ్వతములు. జీర్ణించిపోయేవి శరీరములు. దహించిపోయేది శరీరము. కన్న తల్లి, పుట్టిన కుమారుడు ఈ రెండు శరీరములూ నశించేవే. మార్పుచెందే దేహములు, మార్పుచెందే ప్రాణములు, మార్పుచెందే సంబంధములు శాశ్వతము కావు. ప్రతి మానవునకు, ప్రతి జీవికి నిజమైన తల్లి సత్యమే. త్రికాలభాద్యం సత్యం. నీవు పుట్టక పూర్వము సత్యమున్నది. నీవు పుట్టిన తర్వాత సత్యమున్నది. మరణించిన తర్వాత సత్యమున్నది. ఈ సత్యము ఏనాటికీ మారునది కాదు. కనుక, మార్పు చెందనిది, అమృత స్వరూపమైనది, అమరత్వమైనది సత్యము. కనుక, ప్రాచీన కాలమునుండి భారతీయ సంస్కృతిలో సత్యము దైవము. కనుక, మన తిల్లి సత్యము. అనగా దైవమే తల్లి. పితా జ్ఞానం. తండ్రి ఎవరు? భౌతిక దేహమును సంరక్షించి, అభివృద్ధి పరచి సాకిన వ్యక్తి ఆ తండ్రి. ఇతడు కేవలము సంరక్షకుడు మాత్రమే. కానీ, నిజమైన తండ్రి జ్ఞానము. ఈ జ్ఞానమే దైవస్వరూపము. ఉపనిషత్తులందు దైవము సత్యం, జ్ఞానం అనే పేర్లతో ప్రకటిస్తూ వచ్చాయి. తల్లి సత్యము. తండ్రి జ్ఞానము. మన సోదరులెవరు? మన కంటె ముందు పుట్టినవారు పెద్ద సోదరులు. తరువాత పుట్టినవారు చిన్న సోదరులు. ఈ దేహసంబంధమైన సోదరులు సోదరులు కారు. అయితే ప్రాకృతమునకు వారు సోదరులే. కానీ, నిజమైన సోదరుడు ధర్మమే. సత్యము, జ్ఞానము, ధర్మము దైవస్వరూపాలు. దయా సఖీ. సోదరి ఎవరు? కేవలము శరీరసంబంధమైన సోదరినే సోదరిగా భావిస్తున్నాము. కాదుకాదు. దయయే మన సోదరి. శాంతం పత్నీ. పి పత్ని రెండూకూడా శాంతమే. ఈ శాంతమే లేక జగత్తే జరగదు. శాంతియే ప్రతి మానవునకు శోభాయమానముగా వెలిగే ఆభరణము. శాంతియే దైవము. కనుక, సత్యం, జ్ఞానం, ధర్మం, శాంతి దైవస్వరూపములే. క్షమ మన పుత్రుడు. ఇది కేవలము అందరికీ లభించేది కాదు. ఈనాటి పుత్రులు కలియుగ ప్రభావముచేత తండ్రి సంపాయించిన ప్రోపరిటీని అనుభవిస్తున్నారేగానీ తండ్రియొక్క లక్ష్యముగానీ, తండ్రి సత్యమును కాపాడేవారు లేరు. తండ్రి గౌరవమును, తండ్రి మాటను, తండ్రి ఆశయములను తు.చ. తప్పక నడచుకుంటూ వుండే పుత్రులు లేరు. తాను ఆడిన మాట తప్పకుండా ఫలించే నిమిత్తమై సర్వసుఖములను త్యజించి అరణ్యములో ప్రవేశించి తండ్రి మాటను గౌరవించినవాడు రాముడు. కనుక, 'రామో విగ్రహవాన్ ధర్మః'. రాముడుకూడా దైవస్వరూపమే. క్షమ దైవస్వరూపమే. ఈ ఆరుమంది ప్రతివానికి సరైన బంధువులు. సత్యం, జ్ఞానం, ధర్మం, దయ, శాంతి, క్షమ యివన్నీ మన నిజమైన బంధువులు. ఈ బంధుత్వము మనము కాపాడుకొనే నిమిత్తమై ఆ మానవత్వము మనకు ప్రాప్తించింది. ఈ మానవతా విలువలను మనము ఈనాడు మరచిపోయినాము.

నిన్ననేడు ప్రారంభమైన చరిత్రలను మనము లక్ష్యమునందుంచుకొని జీవిస్తున్నాము. ప్రాచీన చరిత్రలను మనము ఈనాడు విస్మరించాము. కనుక, ఈనాటి మానవుడు తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండినంత వరకు విచారములతో, దుఃఖములతో కుమిలిపోతున్నాడు. కారణం ఏమిటి? మన ప్రాచీన సంస్కృతిని మనం విస్మరించాము. ఆధునిక సంస్కృతిని ఈనాడు అనుభవిస్తున్నాము. ఇది కేవలము క్షణికమైనది. దీనిని విద్యార్థులు లక్ష్యమునందుంచుకొని ఈ మానవతా విలువలు మీరు కాపాడుటకు తగిన కంకణము కట్టుకోవాలి. ఈనాడు మనం ప్రేమించవలసినది, ఈనాడు మనం ఆశించవలసినది, ఈనాడు మనం సంపాదించవలసినది విద్యాధనములు కాదు. ప్రేమ అనే గుణమును మనం సంపాయించాలి. వైస్‌ఛాన్సలర్ చెప్పారు, మీరు సోల్జర్సుగా తయారుకావాలని. soldiers కాదు, soul dears కావాలి. దేహము కాదు. ఈ soldiers రాజకీయ సంబంధమైనది. ఆత్మను ప్రేమించే మెసెంజర్సుగా మీరు తయారు కావాలి.

పుట్టినది ఎక్కడ? పెరిగినది ఎక్కడ? భుజించినది ఎక్కడ? గాలి పీల్చుకొన్నది ఎక్కడ? అన్నీకూడా పవిత్రమైన భారతదేశమందే. హిందూ అని చెబుతూ వచ్చారు. hindu అనగా అర్థమేమి? హింసను దూరం గావించేవాడని చెప్పాడు అనీల్ కుమార్. కాదుకాదు. HINDU. H- humanity, I-individuality, N-nationality, D- divinity, U-unity. ఇది hindu యొక్క సాంప్రదాయము. పంచప్రాణములు. పంచేంద్రియములు. ఇవే పంచకోశములు. ఇవే పంచతత్త్వములు. ఇవే పంచభూతములు. దీనిపై బ్రతికే భారతీయులు ప్రాచీన కాలమునుండి సంస్కృతిని ఆధారము చేసుకుంటూ వచ్చారు. సంస్కృతి అనగా ఏమిటి? సంస్కరింపబడినదే సంస్కృతి. టంబ్లరు చేయాలంటే ఎంత సంస్కరించాలి. వెండిని తీసుకోవాలి, అగ్నిలో వేయాలి, కరిగించాలి, మిషనులో వేయాలి, రెకును తీయాలి. తరువాత టంబ్లరు చేయాలి. ఇన్నివిధములుగా సంస్కరించిన తరువాతనే టంబ్లరుగా తయారౌతుంది. ప్రతి పదార్థముకూడా సంస్కారముచేత ఉపయోగపడే వస్తువుగా తయారౌతున్నాది. నిత్యజీవితములో వుపయోగపడే ప్రతి పదార్థము సంస్కరింపబడినదే. భారతీయులేగాదు విదేశీయులైనా

నిద్దురనుండి లేచి మరి నిద్దురపోయెడుదాక పొట్టకై
హద్దునుపద్దు లేక వ్యయమందగజేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవిందదళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబునొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!

తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంత వరకు ఎన్ని యోచనలో, ఎన్ని చింతలో, ఎన్నివిధములైన అల్లకల్లోలములో జరుగుచున్నవి హృదయములో. ఇవన్నీకూడా సంస్కరింప చేసేవే.

భారతీయ సంస్కృతి చాలా విలువైనది. భారతీయ సంస్కృతియందు ధర్మార్థకామమోక్షము లన్నారు. ఇవి నాలుగు. మొదటిది ధర్మము, కడపటిది మోక్షము. ఈరెండింటిని త్రుంచి అర్థకామములలో జీవిస్తున్నారు ఈనాటి మానవులు. ఈ అర్థకామములన్నీ ధర్మమయము కావాలి. ధర్మ పరము కావాలి. ధర్మజీవితము కావాలి. అప్పుడే అర్థమునకు విలువ వుంటుంది. మానవ జీవితము, అర్థము పరమార్థముతో కూడినవే. జీవిత అర్థము, పరమార్థము. రెండింటి సమ్మిళిత స్వరూపమే మానవ జీవితము. ఇలాంటి మానవతా విలువలు మనం విస్మరించాం. కనుక, మానవుని విలువ తగ్గిపోయింది. ఈనాడు ప్రపంచములో ఏ చిన్న వస్తువైనా కొనటానికి వెళ్ళు, విలువ చాలా పెరిగిపోయింది. ఊద్చే పొరక, విలువ ఎక్కువైపోయింది. కానీ, మనిషి వెల తగ్గిపోయింది. మనిషికి విలువయే లేదు. కారణం ఏమిటి? మనిషిలో వుండవలసిన గుణములు లేకపోవటంచేత, విలువ పోయింది. మానవతా విలువలు మానవునికి అత్యంత ప్రధానమైనవి. ప్రమాణమైనవి. ఈవిధమైన ప్రమాణములు నిత్యజీవితములో ఆచరణ రూపమున నిరూపిస్తూ రావాలి. మాటలతో పవిత్రము గావించాలి. తనయొక్క చేష్టలు పవిత్రముగా వుండాలి.

నేటి విద్యార్థులారా! నా మాట వినుడీ!
పరుష వాక్యాలు ఎప్పుడు పలుకబోకు
పరుష వాక్యములాడుట పాపమగును
అతిగ మాట్లాడుటది మీకు హానియగును
రూమురూముకు పోవుట ర్యాట్ అగును
కాని, విద్యార్థి జీవితము లైట్ కావలయు.

మొట్టమొదట నేర్చుకోవలసింది, మాటలను చక్కగా పలకాలి. You can not always oblige but you can speak obligingly. రూమురూముకు బయలుదేరి ర్యాట్, క్యాట్ మాదిరి వుండకూడదు. ఈ గుణాలు మీరు చక్కదిద్దుకుంటే మీరు ఎంతైనా బాగుపడతారు.

భారతీయ సంస్కృతియందు మూడు ప్రధానము. నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము. ఈ మూడింటితో జీవితమే మానవుని త్రిపుటి స్వరూపము. మొట్టమొదట నైతికము. సంకల్పము పవిత్రమైన సంకల్పము రావాలి. ఈ

నైతికమైన సంకల్పము వచ్చేటప్పటికి వాక్కు అనే ధార్మికము అక్కడ బయలుదేరుతుంది. ధార్మికము మనలో ఆవిర్భవించిన తక్షణమే ఆధ్యాత్మికము ఆవరిస్తుంది. కాబట్టి, thoughts, words, actions మూడింటి ఏకత్వము కావాలి. దీనికే the proper study of mankind is man మనము మానవునిగా పుట్టాము. మానవునిగా జీవిస్తున్నాము. ఎన్ని విద్యలో నేర్చుకుంటున్నాము. తెలివితేటలను పెంచుకుంటున్నాము. ఎన్ని పెంచుకున్నా అన్నింటికి ప్రధానమైనది, ప్రమాణమైనది ప్రేమ, ప్రేమ.

సత్యములోకూడా ప్రేమవుండాలి. నీవు సత్యము చెప్పినా ప్రీతి కలిగించే సత్యము చెప్పు. అసంతృప్తి కలిగించే సత్యము చెప్పవద్దు. ఉద్వేగమునిచ్చే సత్యాన్ని చెప్పకూడదు. ప్రీతికరమైన సత్యము చెప్పాలి అనింది భగవద్గీత. కాబట్టి, సత్యములోకూడా ప్రేమ వుంటున్నాది. జ్ఞానంలోకూడా ప్రేమ వుంటున్నాది. జ్ఞానములో ప్రేమ లేకపోతే జ్ఞానమే కాదు. చెరకులో మధురమైన రసము లేకపోతే అది బెండు మాత్రమే. మనము జ్ఞానులై మనలను మనం తెలుసుకోలేకపోతున్నాము.

చెట్టులోని మధుర రసం కొమ్మలనుభవించునా!
పూలలోని మధుర రసం తీగలనుభవించునా!

చెట్టులో మధు ఫలములుంటున్నాయి. కానీ, చెట్టుకు తెలియదు. తీగలలో మంచి సుగంధపుష్పములుంటున్నాయి. కానీ, ఆ తీగకు తెలియదు. కారణం ఏమిటి? ప్రేమ లేదు దానిపైన. కనుక, జ్ఞానములోకూడా ప్రేమ వుంటున్నాది. ధర్మము. ఎవరికైనా దానధర్మం చేయాలంటే ప్రేమ లేకుండా వీలవుతుందా? ధర్మములోకూడా ప్రేమ వుంటున్నాది. శాంతములోకూడా ప్రేమ వుంటున్నాది. అన్నింటియందు ప్రేమ అంతర్వాహిని. ప్రేమ లేక ప్రాణమే లేదు. ప్రేమ లేక ఒకరినొకరు యేమాత్రమూ చేరి వుండలేరు. ఐకమత్యమునకు ప్రేమయే ప్రధానము, ప్రమాణము. ప్రతి మానవునికి ప్రేమ, ఐకమత్యము అత్యవసరము.

విద్యార్థులారా! మొట్టమొదట ప్రేమ పెంచుకోవాలి. ప్రేమ ఒక్కటి వుంటే అంతటినీ అదే చేర్చుకుంటుంది. మీరు లెటర్ వ్రాస్తారు. ఆ లెటర్ ఒక కవరులో పెడతారు. కవరును గమ్ లేక అతికించ లేరు. ఒకదానికొకటి అతికించేది గమ్. ఆ గమ్ ప్రేమ. ఆ ప్రేమ ఒకరిని ఒకరికి అతికించుకు పోతుంది. ఒక వ్యక్తికి, మరొక వ్యక్తికి సంబంధము ఏర్పడిపోతుంది. ఈనాడు దురదృష్టవశాత్తు భారతదేశము స్వాతంత్ర్యము సాధించిందిగానీ ఐక్యతను సాధించలేదు. మీకందరికీ తెలుసు. పూర్వము అశోకచక్రవర్తి భారతదేశమును పాలించిన చక్రవర్తి. చిహ్నము నాలుగువైపుల సింహము తలలుంటాయి. అతనికి కొన్ని సాంప్రదాయములుండేవి. అతను జన్మదినోత్సవము జరుపుకొనేవాడు. ఒక సామంతరాజుకు బహుమతి అందించేవాడు. ఒక జన్మదినోత్సవమునకు సామంతరాజులందరిని ఆహ్వానించాడు. అందరూ వచ్చారు. తూర్పునుండి వచ్చిన సామంతరాజు,' ప్రభూ! ఇంతకు పూర్వము నేను సంపాయించినదానికంటె మూడురెట్లు అధికముగా సంపాయించి మీ ఖజానాకు తీసుకువచ్చాను' అని విన్నవించాడు. తాను సంతోషించినట్లుగా కూర్చున్నాడు రాజు. తరువాత రాజును పిలిపించాడు. అతను లేచాడు. 'మహారాజా! పెట్టవలసిన ఖర్చులు చాలా తగ్గించి, అధికారుల జీతాలు తగ్గించి ధనమును కూడబెట్టి ఆరింతలు అధికముగా తీసుకువచ్చాను తమ జన్మదినోత్సవమునకు' అన్నాడు. అశోకచక్రవర్తి 'కూర్చోండి' అన్నాడు. ఉత్తరముననున్న రాజు వచ్చాడు. 'రాజా! నేనేమీ తేలేకపోయాను. ఎందుకనగా రాజ్యములో సకాల వర్షములు లేవు. సకాల పంటలు లేవు. కనుక, ప్రజలను చిక్కులు పెట్టలేకపోతున్నాను. ఈతూరి నేను యేమీ తేలేదు' అన్నాడు. 'సంతోషం. కూర్చో' అన్నాడు. దక్షిణ దేశపు రాజు వచ్చాడు. 'నేను ఈతూరి పన్ను ఎక్కువ వేసి, ఖర్చులు తగ్గించి, అలజడులు జరుగుతుంటే అలజడులు తగ్గించి, అలజడులు అభివృద్ధిపరచేవారిని జైలులో పెట్టి రాజ్యమును ప్రశాంతముగా చేసుకొని వచ్చాను' అన్నాడు. 'సరే, కూర్చో' అన్నాడు. తరువాత మగధ దేశపు రాజు నెమ్మదిగా లేచాడు. 'రాజా! నేను తమకు నా ప్రేమను మాత్రమే తెచ్చాను. ప్రజల క్షేమమే నా క్షేమమని ప్రజల క్షేమము గుర్తించి బీదలకు విద్యాలయములు, వైద్యాలయములు అభివృద్ధి పరచాను. త్రాగటానికి నీరు చాలా అవసరము. బావులు

తవ్వించాను. కొలనులు కట్టించాను. ప్రజలకు ఏవిధమైన యిబ్బందులు కలగకుండా వారి సంక్షేమమే నా క్షేమంగా భావించి వారి ధనమును వారికే వినియోగించాను. ప్రజలందరూ చాలా ఆనందిస్తున్నారు. ఏ అధికారి జీతము తగ్గించలేదు. అధికారులకు తగిన ఉత్సాహప్రోత్సాహములందించి వారికే ధనము యిచ్చి ప్రజాసంక్షేమమునకు వినియోగించండని అప్పచెప్పాను. మీ జన్మదినమునకు నేను ప్రేమను మాత్రమే యిస్తున్నాను. నా రాజ్యముయొక్క సంక్షేమాన్ని నీకు అర్పితము చేస్తున్నాను. ప్రజలందరూ సుఖశాంతులతో జీవిస్తున్నారు' అన్నాడు. అశోకచక్రవర్తి చాలా ఆనందించాడు. తన పరివారమును పిలిపించి ఏనాడూ ఎవరికీ అందించని గొప్ప బహుమతిని ఈ మగధ రాజుకు అందించాడు. దీని అర్థమేమిటి? ధర్మచక్రవర్తులు ప్రజాసంక్షేమమే దృష్టియందుంచుకోవాలి. ప్రజలకు యేది అవసరమో దానిని మాత్రమే మనము అభివృద్ధి చేయాలి. సత్రములు కట్టించాడు. రోడ్లు రిపేరు చేయించాడు. విద్యాలయములు అభివృద్ధి చేశాడు. ఆరోగ్యమునకు వైద్యాలయములు కట్టించాడు. త్రాగటానికి నీరిచ్చాడు. నిత్య జీవితములో అత్యవసరమైనవి. ఇవి వుంటే ప్రజలలో యేవిధమైన అలజడులు జరగవు. కనుక, ప్రజలలో ప్రశాంతత కలగాలంటే గీతలో చెప్పినట్లు 'మమాత్మా సర్వభూతాంతరాత్మా' అందరియందున్నది నా ఆత్మయే అనుకుంటే ఏవిధమైన కలహములు, కల్లోలములు, హింసలు జరగటానికి వీలులేదు. అందరిలోనున్నది నా ఆత్మయే. అప్పుడు ఎవరు ఎవరిని హింసిస్తారు! ఎవరు ఎవరిని బాధిస్తారు! ఎవరు ఎవరినీ బాధించటానికి వీలుండదు. తన ఆత్మను తాను ప్రేమించుకుంటాడుగానీ హింసించుకోడు. ఒక నిలువుటద్దములో తాను నీడ చూచుకుంటే, ఆ నీడను చూచి తాను ద్వేషిస్తాడా! ఆత్మయే నీ దైవము. ఆత్మయే శివుడు. ఆత్మయే విష్ణువు. ఆత్మయే బ్రహ్మ. ఆవిధమైన తత్త్వాన్ని గుర్తించటానికి మరొక గురువు ఎందుకు? ప్రతి మానవునియందున్నది ఒకే భగవంతుడే. అందరూ భగవత్స్వరూపులే. ఈవిధమైన భావము మనము అభివృద్ధి పరచుకుంటే కలహములకు, కల్లోలములకు యేమాత్రం అవకాశముండదు. ఈనాడు దేశములో యిలాంటి పవిత్రమైన భావములు విస్మరించారు. అసలు కంటికికూడా కనిపించటం లేదు. ఎక్కడ చూచినా ద్వేషము. ఎక్కడ చూచినా అసూయ. ఎక్కడ చూచినా స్వార్థము. ఎక్కడ చూచినా స్వప్రయోజనము. ఈ దుర్మార్గ లక్షణాలు పెరిగిపోవటం చేతనే పవిత్రమైన సంబంధము వీడిపోతున్నది. మనలోనున్న సంబంధము ఏకాత్మ సంబంధము. అందరియందు వున్నది 'నేనే'. రామయ్య ఎవరు అంటే, 'నేను' అని లేస్తాడు. కృష్ణయ్య ఎవరు అంటే, 'నేను' అని యింకొకడు అంటున్నాడు. ధర్మయ్య ఎవరు అంటే. 'నేను' అంటున్నాడు మరొకడు. అందరినుండి వచ్చే జవాబు ఒక్కటే, 'నేను'. బిక్షగాని మొదలుకొని కోటీశ్వరుని వరకు సమాధానము, 'నేను' అని ఉపయోగపెడతారు. కనుక, భగవంతుని మొట్టమొదటి నామము 'నేను'. అదే 'అహం'. అదే మొట్టమొదటిది. మమాత్మా సర్వభూతాంతరాత్మా. 'నేనే' అది అందరియందు వుంటున్నది. ఈ 'నేను' అనేది అనంతము, శాశ్వతము. నేను అనే పదమునకు ప్రక్కన మనిషి అని పెట్టినప్పుడు నేను మనిషిని అంటున్నాము. నేను అనంతము. అంత్యమయ్యేది మనిషి. మనిషి అనంతము కాదు. అంతముతో కూడినవాడు. నేను అనేదానికి అంతమే లేదు.

అహం బ్రహ్మోస్మి. బ్రహ్మ అంటే ఏమిటి? ఏదో నాలుగు ముఖాలు పెట్టుకొని సినీమాలో చూపించేది కాదు. బ్రహ్మ, బృహత్ స్వరూపం. విశాలం. expansion of love is brahma. cotraction of love is death. అందువల్లనే దైవం లేని చోటు లేదు. ఒక ఉదాహరణ. ఎవరో తలుపు తట్టినట్లైంది. గోపిక తలుపు తీద్దామా అనుకొంది. తీస్తే ఎవరైనా లోపల ప్రవేశిస్తారేమో? తీసేదా? వద్దా? అనుమానం వచ్చింది. తనకు తాను యోచన చేసుకొంది. నాలో నీలో వున్నందంతా ఒక్కటే. తలుపు తెరిస్తే యేమి, మూస్తే యేమి!

వేయబోవని తలుపు, తీయమంటూ పిలుపు
హృదయమెందుకొ నవ్వుగొలుపు.
వీణతంత్రులు మీటి ప్రాణతంత్రులు నాటి
ఆత్మార్పణమె చేసి కైలాసమే చూడరా
ఓ జీవ! వీధి వాకిలి అదియెరా!

విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన
వీధివాకిలి ఏదటో!
విశ్వవిభుడే నా వెనువెంటనే వుండ
పిలుపేది తలుపేది వీధివాకిలి ఏది!

ఎక్కడ చూచినా ఇల్లే వుండినప్పుడు, యింక వీధి ఎక్కడుంది. దానికి వాకిలి ఏది? ఎక్కడ చూచినా మందిరమే వుంటున్నాది. వేరే ఒక యించైనా స్థలము లేదు. కాబట్టి, వీధివాకిలి ఎందుకు? అంతా మనయందే వున్నది. మన హృదయమే భగవత్స్వరూపం. బలహీనతకు మన హృదయమే కారణం. బలమునకూ మన హృదయమే కారణం. దోషరహితులకే బలము వస్తుంది. దోషికే భయం వస్తుంది. దోషరహితులకు భయమే వుండదు. ప్రేమ తత్త్వమే కలదు మనలో. కనుక, దైవాన్ని ప్రేమించి ఆ భయాన్ని దూరం చేసుకోవాలి. అప్పుడే నీ హృదయ కవాటం తెరుచుకుంటుంది. ఆ హృదయ కవాటం తెరుచుకోటమే కైలాసం. అదియే మన విలాసము. అదియే మన నివాసం. అన్నింటికీ హృదయమే మూలకారణం.

విద్యార్థులారా! ఈనాటి విద్యార్థుల హృదయాలంతా చాలా కల్మషమయంగా వుంటున్నాయి. కాదు, కాదు. నిత్యమూ ప్రేమ అనే జలంతో శుభ్రం చేయండి. శ్రద్ధ అనే విమ్‌తో తోమండి. అదే విశ్వాసం. అప్పుడే ఆనందమనేది మనకు లభ్యమౌతుంది. అప్పుడే మన హృదయము ప్రకాశవంతమౌతుంది. ఒక్కొక్క పిల్లవాడు ఒక స్టార్‌లాగ వుండాలి. ఫిల్ముస్టార్‌లాగ కాదు. ప్రకాశవంతంగా వుండాలి. మీ ముఖాలలో ఆ ప్రకాశము కనబడాలి. ప్రేమను పెంచుకోండి. జనుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకోండి. అందరియందు దైవమున్నాడనే సత్యాన్ని మరువకండి. "brotherhood of man fatherhood of God" అనే సత్యాన్ని క్రమక్రమేణా పెంచుకొని, కట్టకడపటికి నీవూ నేనూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి. అదే మన భారతీయ సంస్కృతిలో అనేకత్వములోని ఏకత్వము. అనేకత్వములోని ఏకత్వాన్ని మీరు విశ్వసించండి. మన సంస్కృతిలో నమస్కారము అంటారు. ఈ నమస్కారము అంటే ఏమిటి? ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు వీటిని ఒక్కటిగా చేర్చుకోటం. అహంకారము లేనిటువంటిది నమస్కారం. కొంతమంది చాలా విచిత్రంగా చేస్తుంటారు నమస్కారం. ఏదో గొడ్డలితో కొట్టినట్లుగా చేస్తారు. రెండు చేతులూ చక్కగా చేర్చాలి. రెండు బొటన వేళ్లు చక్కగా హృదయాన్ని తాకాలి.

ప్రేమ మన స్వరూపమే. you are the embodiment of love. you are the embodiment of peace. you are the embodiment of truth. you are the embodiment of God. నీవు ప్రత్యేకము కాదు. దైవమే నీవు. కనుక, నిన్ను నీవు స్మరించుకో. నీ హృదయాన్ని భగవంతునితో ఏకం చేయి. ఆ ఏకం చేసే సమయంలో నీకు వచ్చే ఆనందం చెప్పటానికి లేదు. అది అనుభవిస్తేనే తెలుస్తుంది. సముద్రం చూడని వానిని సముద్రం ఎలావున్నదని అడుగుతే ఏమి చెప్పగలడు! సత్యాన్ని పొందాలంటే సత్యంతోనే కలపాలి. నెయ్యి ఎలావుంది? నెయ్యి మాదిరిగానే వుంది. దానికింకో పోలిక లేదు. కనుక, దైవము ఎలావుందంటే, దైవం ప్రేమగా వుంటుంది. ప్రేమ ఎలా వుందంటే, ప్రేమగానే వుంది. ఇంకా ఎక్కువగా వుంటే ప్రేమకు దీర్ఘం యివ్వవచ్చు. కాని, దానిని యింకోలా చెప్పలేము. కనుక, ప్రేమచేత ధన్యం చేసుకొని, సమాజానికి సేవ చేసి love all, serve all.

ప్రేమ ముదిత మనసె కహో రామరామరాం....